సాక్షి జోగుళాంబ గద్వాల

బుధవారం, 26, జూలై, 2023



ఒక యూనిట్‌లో..
జూరాలకు 10 వేల క్యూసెక్కుల వరద రావడంతో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది.
వివరాలు 8లో ▸



గుండె వైద్యసేవలు
పాలమూరులోనే గుండె వైద్య చికిత్స అందిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 29.4 /22.7

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో నియామకాలు

గద్వాల న్యూటౌన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అధ్యాపకులు, పీజీటీల ఖాళీలను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయనున్నట్లు సమన్వయ అధికారి రఘు ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ బాలుర కళాశాలలో జంతుశాస్త్రం, గట్టు బాలికల కళాశాలలో రసాయన శాస్త్రం, ఇటిక్యాలలో పీజీటీ సాంఘికశాస్త్రం, మానవపాడు జూనియర్ కళాశాలలో పీజీటీ హిందీ ఖాళీలున్నాయని.. అర్హులైన అభ్యర్థులకు డెమోలు నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువపత్రాలతో బుధవారం సాయంత్రం 4 గంటలలోపు సెల్ నంబర్ 79950 10612 సంప్రదించాలని సూచించారు.

'ఇచ్చిన హామీలు విస్మరించిన బీఆర్‌ఎస్'



అయిజ: ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చి అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని బింగిదొడ్డిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేటికీ పూర్తి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి రూ.వేల కోట్లు మంజూరు చేసిందని.. ఆ డబ్బును ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించారని ఆరోపించారు. కేంద్రం, రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని.. అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, ప్రధానకార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా ఓబీసీ కార్యవర్గసభ్యుడు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో తీవ్ర నష్టం

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



అయిజ: బీఆర్‌ఎస్ నాయకులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని.. సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో కూలిన వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్‌ను ఆయన పరిశీలించి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదేళ్లవుతుందని.. గడిచిన అయిదేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజల్లోకి వెళ్తే నిలదీస్తారనే భయంతో ఆదరా బాదరాగా పనులు చేస్తున్నారని.. పట్టణంలోని పెద్దవాగుపై వర్షాకాలంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ కూలిందని తెలిపారు. దీంతో ఇటిక్యాల మండలం మినహా మిగిలిన ఆరు మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిందని.. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు లభించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల తొందరపాటుతో ఇంత పెద్ద నష్టం జరిగిందని. కాంగ్రెస్‌పార్టీ దీన్ని తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. నష్టానికి అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్, బ్రిడ్జి పనులు పూర్తిచేయాలని కోరారు.

పాలమూరు ప్రజాగర్జన..
ఈ నెల 30న కొల్లాపూర్‌లో పాలమూరు ప్రజాగర్జన సభ నిర్వహిస్తామని, ముఖ్యఅతిథిగా ప్రియాంకగాంధీ హాజరవుతారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. ఎన్నికల శంఖారావం కొల్లాపూర్ నుంచి ప్రారంభిస్తామన్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలిపారు. అనంతరం మండలంలోని కుటుకనూరుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, డీసీసీ ఉపాధ్యక్షుడు గిత్తల దేవరాజు, జిల్లా ప్రధానకార్యదర్శిహనుమన్న, సాంబశివుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, డీసీసీ స్పోక్స్‌పర్సన్ మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దోమ.. వదిలించుకోలేమా!



జిల్లాకేంద్రంలోని కందకంలో పేరుకుపోయిన మురుగు

- పురకేంద్రాల్లోని కాల్వల్లో పేరుకుపోయిన మురుగు
- తొలగింపుపై దృష్టి సారించని అధికారులు
- ముందుకుపారని వర్షపు నీరు
- భయాందోళనలో జనం

గద్వాల: వర్షాకాలంలో నిల్చున్నా.. కూర్చున్నా.. పడుకున్నా.. నిద్రిస్తున్నా.. దోమ కాటు తప్పడం లేదు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దోమల విజృంభణ అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నివారణకు మున్సిపాలిటీ పరంగా ఏటా రూ.లక్షల్లో వెచ్చిస్తున్నా.. ఫలితం అంతంత మాత్రమే. ఫాగింగ్, కాల్వలు, మురుగు గుంతల్లో రసాయనాలు పిచికారీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో కిందిస్థాయి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణాల్లోని కొన్ని ప్రాంతాల్లో దోమల బెడద ఏ మాత్రం తగ్గడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు జనాన్ని వెంటాడుతున్నాయి. జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు..
పట్టణాల్లోని కాలనీల్లో ఉన్న అంతర్గత కాల్వలతో పాటు కందకాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దోమల విజృంభణ పెరిగిపోతోంది. జిల్లాకేంద్రంలో సగభాగం కందకాలు విస్తరించడంతోపాటు చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. ఎగువ ప్రాంతాలు, చిన్న చిన్న కాల్వల నుంచి వచ్చే మురుగు కందకాల్లో కలుస్తున్నాయి. సక్రమంగా పూడిక తీయకపోవడంతో కందకాలన్నీ చెత్తా చెదారంతో నిండిపోయాయి. ప్రస్తుతం అడపా దడపా వర్షాలు కురవటంతో ఈ కందకాల నుంచి నీరు దిగువకు పారేందుకు, సుంకులమ్మ మెట్టు వెనుక భాగాన ఉన్న అవుట్‌లేట్ దగ్గర అనువైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఇటీవల పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీల్లో పూడికతీత పనులు నామమాత్రంగా సాగాయి. పురపాలికల్లోని కాల్వల్లో ప్లాస్టిక్ కవర్లు నిండటంతో మురుగు పారుదలకు ఇబ్బందిగా మారుతోంది. ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోవడంతో దోమల ఉధృతి పెరిగిపోతోంది. గద్వాలలో కాస్త మెరుగ్గా ఉన్నా.. మిగిలిన అయిజ, అలంపూర్, వడ్డేపల్లి పుర కేంద్రాల్లో దోమల నివారణ చర్యలు మచ్చుకైనా కనిపించవు.

పురపాలికల వారీగా ఇలా..

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా
గద్వాల	37	80 వేలు
అయిజ	20	40 వేలు
అలంపూర్	10	11 వేలు
వడ్డేపల్లి	10	13 వేలు

అదనపు భారం..



దోమల విజృంభణతో అదనపు ఖర్చులు, ఆర్థిక భారం పెరుగుతోంది. లార్వా దశలోనే నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలి.
– రాజారెడ్డి, గద్వాల.

నివారణ చర్యలు..



డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించే చర్యలు ప్రారంభించాం. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాం. ఫాగింగ్ యంత్రాలను వినియోగించి కాలనీల్లో రసాయనాలను పిచికారీ చేస్తున్నాం.
– నర్సింహ, కమిషనర్, గద్వాల పురపాలిక

ఏడాదికి రూ.4 కోట్లపైనే..
జిల్లాలోని నాలుగు పట్టణాల్లో సుమారు 30 వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబంలో ఎవరి స్థాయిని బట్టి వారు రోజుకు రూ.2 నుంచి రూ.5 వరకు దోమల నివారణ కోసం ఖర్చు చేస్తున్నారు. సగటున నెలకు ఒక్కో కుటుంబం రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు చేస్తోంది. ఇలా పట్టణాల్లో దోమల నివారణ మందుల వినియోగ వ్యయం ఏడాదికి రూ.4 కోట్లపైనే ఉంటోంది. వీటితో పాటు పురపాలకవర్గాలు దోమల నివారణకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న విషయం తెలిసిందే.

భూ కబ్జాలపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల రూరల్: జిల్లాకేంద్రంలోని కుంటవీధి సర్వే నంబర్ 917లో రూ.కోటి విలువ చేసే స్థలం, గంట వీధిలో సర్వేనంబర్ 1,096లో సుమారు రూ.కోటికి పైగా విలువ జేసే 18 గుంటల భూమిని అధికార పార్టీ నాయకులు కబ్జా చేయడంతో 'సాక్షి' దినపత్రికలో 'దర్గాగా కబ్జా', 'అటు దిక్కు చూడలే' అన్న శీర్షిక రెండ్రోజుల పాటు వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు స్పందించిన అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్ మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పుర కమిషనర్ నర్సింహను వేర్వేరుగా తన కార్యాలయానికి పిలిపించుకొని విచారించి సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సర్వేనంబర్ 917లోని పది శాతం స్థలాన్ని కబ్జాచేసిన నాయకుడికి ఏడురోజుల గడువుతో కూడిన రీవోక్ నోటీసును పోస్టులో పంపినట్లు కమిషనర్ నర్సింహ తెలిపారు. అలాగే సర్వేనంబర్ 1,096లో 18 గుంటల భూమి ప్రభుత్వానిదని విచారణలో తేలిందని.. బుధవారం సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి బోర్డు పెడతామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.



దర్గాగా కబ్జా!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



మానవపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- కలెక్టర్ వల్లూరి క్రాంతి

మానవపాడు: రైతులు అధిక దిగుబడులు పొందేందుకు నాణ్యమైన విత్తనాలు వినియోగించాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ కొనుగోలు సమయంలో దుకాణదారుడి నుంచి రసీదు పొందాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని కోరమండల్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఆవరణలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించాలని వైద్యులను ఆదేశించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. ఆరోగ్యకేంద్ర పాత భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, సాధారణ కాన్పుల సంఖ్య పెరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మానవపాడు రైల్వే క్రాస్‌రోడ్డు వద్ద పొలాలకు వెళ్లే దారిని కాంట్రాక్టర్లు మూసివేసి గోడ నిర్మించారని.. నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఓటరు జాబితాలో మార్పుచేర్పులు వెంటనే చేపట్టాలని.. ఇల్లిల్లూ తిరిగి ఓటరు నమోదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నీచర్, ర్యాంపు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. గ్రామాల్లో హరిత లక్ష్యం పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో డా. శశికళ, డా. స్రవంతి, డా. రిజ్వాన తాన్వీర్, ఏపీడీ నాగేంద్రం, పంచాయతీరాజ్ ఈఈ ఆంజనేయులు, ఏఈ నరేందర్, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ రమణారావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా..
గద్వాల రూరల్: ఓటరు నమోదు, తొలగింపు, మార్పుచేర్పులకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఆరు వేల దరఖాస్తులు వచ్చాయని ఈ నెల 27 నాటికి పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించేందుకు బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, ఆర్డీఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం..
గద్వాల రూరల్: డ్రగ్స్‌ను తరిమికొట్టి యువత భవిష్యత్‌ను కాపాడుదామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో డ్రగ్స్, గంజాయి నిర్మూలన చర్యల్లో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా కలెక్టర్ వల్లూరు క్రాంతి, వైస్ చైర్మన్‌గా ఎస్పీ సృజన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్, గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని.. పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు నిరంతరం దాడులు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా డ్రగ్స్, గంజాయి వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగు చేయడం చట్టరీత్యా నేరమని రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో డీఎఫ్‌ఓ నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, అబ్కారీశాఖ అధికారి సైదులు, డీఈఓ సిరాజుద్దీన్, జెడ్పీ సీఈఓ ముషాయిదాబేగం, డీఎంహెచ్‌ఓ డా. శశికళ, ఎక్సైజ్ సీఐ గోపాల్, జాకీర్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: చేనేత కార్మికుల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన చేనేత కార్మికుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వారికి బీమా పత్రాలు అందజేసి మాట్లాడారు. కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న నేత కార్మికుల కోసం మంత్రి కేటీఆర్ చేనేతమిత్ర, చేనేతబంధు, సిల్క్ రాయితీ తదితర పథకాలను తీసుకొచ్చారని.. వాటితో భరోసా లభించిందన్నారు. జియో ట్యాగింగ్ మగ్గాలున్న కార్మికులకు పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు నిషాక్, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడికి బీమా పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

వేరుశనగ క్వింటా రూ. 5.600

గద్వాల వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు మంగళవారం 265 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. క్వింటా గరిష్ఠంగా రూ.5,600, కనిష్ఠంగా రూ.3,459, సరాసరి రూ.4,299 ధర పలికింది.

ఓటరు జాబితా పరిశీలనలో వేగం పెంచాలి



గట్టు: ఓటరు జాబితా పరిశీలన త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ ముసాయిదాబేగం బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన చాలా తక్కువగా ఉందని.. వేగం పెంచాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ మహ్మద్ జుబేర్ మోహినోద్దీన్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్‌ఐ శ్రీనివాసులు, కరీం, గణాంక అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏఆర్ ఆర్‌ఐని సన్మానించిన ఎస్పీ



గద్వాల క్రైం: జిల్లా సాయుధ బలగాల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ ఆర్‌ఐ నాగేష్ మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ సృజన, తోటి సిబ్బంది నాగేష్ దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నాగేష్ 2016, అక్టోబర్ 10న బాధ్యతలు చేపట్టి ఏడేళ్ల పాటు విధులు నిర్వర్తించారని, రాజకీయ సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు, బందోబస్తు తదితర కార్యక్రమాల్లో సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ శాంతియుత వాతావరణంలో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా మెలుగుతూ తనదైన శైలిలో విధులు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఇమ్మానుయేల్, సిబ్బంది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రజాగర్జన

30న 'కొల్లాపూర్'లో కాంగ్రెస్ భారీ బహిరంగసభ

- పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ రాక
- మాజీ మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల తదితరుల చేరిక
- మహబూబ్‌నగర్‌లో ముఖ్యనేతల సన్నాహక సమావేశం
- హాజరుకాని సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి
- చర్చనీయాంశంగా మారిన సంపత్ వ్యాఖ్యలు



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, జగదీశ్వర్‌రావు, మల్లురవి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు , ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ సెక్రటరీ మన్సూర్ అలీఖాన్, డీసీసీ అధ్యక్షులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కర్ణాటక ఎన్నికల్లో విజయం.. ఆ తర్వాత రాష్ట్రంలో ముఖ్యనేతల చేరికలతో కాంగ్రెస్‌లో జోష్ నెలకొంది. ఉమ్మడి పాలమూరు నుంచి సైతం చేయి అందుకునేందుకు కీలక నాయకులు ఆసక్తి చూపుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 30న కొల్లాపూర్ నియోజకవర్గంలో పాలమూరు ప్రజాగర్జన పేరిట పెద్ద ఎత్తున బహిరంగసభ నిర్వహణకు ఆ పార్టీ పెద్దలు సన్నాహాలు ప్రారంభించారు. కొల్లాపూర్ నుంచి పెంట్లవెల్లి దారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాట్లు జరుగుతుండగా.. ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ హాజరుకానున్నారు. మాజీ మంత్రి, సీనియర్ నేత జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు ఆమె సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఈ సభలో మహిళా డిక్లరేషన్‌కు సంబంధించిన అంశాలను ప్రియాంకగాంధీ వెల్లడించే అవకాశం ఉండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హాజరు కాని నాగం..
మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సమావేశానికి ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ మన్సూర్ అలీఖాన్, కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ సంపత్ కుమార్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల, మాజీ మంత్రి జూపల్లి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, జగదీశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, వంశీకృష్ణ, రాంమోహన్‌రెడ్డి తదితర నాయకులు హాజరయ్యారు. సీనియర్ నేతలు, మాజీ మంత్రులు నాగం జనార్దన్‌రెడ్డి, చిన్నారెడ్డి హాజరు కాకపోవడంపై పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ కూచుకుళ్ల రాకతో అసంతృప్తిగా ఉన్న నాగం.. ఇదివరకే తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఈసారి తనకే టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్న ఆయన ఓ దశలో పరోక్షంగా జూపల్లిని హెచ్చరించారు. కొత్తగా పార్టీలో చేరుతున్నానని చెబుతున్న ఓ నేత కొల్లాపూర్‌తో పాటు మరో నాలుగు అసెంబ్లీ స్థానాలను తన వారికి కేటాయించాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోందని.. ముందుగా ఆయనను కొల్లాపూర్‌లో గెలవమనండి అని సవాల్ విసిరారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరు కాకపోవడంపై పార్టీ శ్రేణుల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. అయితే నాగం కోర్టు పని మీద హైదరాబాద్‌కు వెళ్లారని.. అందుకే రాలేదని ఆయన ముఖ్య అనుచరులు చెబుతున్నారు.

3 లక్షల మందితో భారీ సభ..
సభకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ రానుండడంతో ఆ పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. భారీగా జనసమీకరణతోపాటు కేంద్రం, రాష్ట్రంలో అధికార పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన అసమ్మతులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరేలా పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇప్పటికే రూపొందించుకున్న జాబితా ప్రకారం వారితో పలు పర్యాయాలు సంప్రదింపులు జరపడమే కాకుండా.. ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. సభకు ఉమ్మడి పాలమూరులోని 14 నియోజకవర్గాల్లో ఒక్కో సెగ్మెంట్ నుంచి కనీసం 25 వేల మంది చొప్పున.. మూడు లక్షలకు తగ్గకుండా జనసమీకరణ చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం ఏనుగొండలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఉమ్మడి పాలమూరుకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు సమాలోచనలు చేశారు.

హాట్‌టాపిక్‌గా సంపత్ వ్యాఖ్యలు..
సన్నాహక సమావేశంలో 'తొమ్మిదేళ్ల నుంచి ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొన్నాం.. అనుభవించాం.. కొత్తగా చేరే మీరు అనుభవించబోతారు.. తొమ్మిదేళ్లుగా మేము అనుభవించింది అవతల ఉండి చూసిండ్రు.. మమ్మల్ని ఎట్లా తొక్కాలో తొక్కి మళ్లీ మా పక్కనే వచ్చి కూర్చున్నారు.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొందాం.. ఏ మాత్రం అధైర్యపడకండి.. మీరు తీసుకున్న నిర్ణయం మంచిది. కాంగ్రెస్ వైభవాన్ని ద్విగుణీకృతం చేసే విధంగా సభ నిర్వహిద్దాం.'అని పార్టీలో చేరే నాయకులను చూస్తూ మాజీ ఎమ్మెల్యే సంపత్ మాట్లాడడం హాట్‌టాపిక్‌గా మారగా కాసేపు నవ్వులు విరబూశాయి. అదేవిధంగా విలేకరుల సమావేశంలో కొల్లాపూర్ నుంచి టికెట్ ఆశిస్తున్న జగదీశ్వరరావు, జూపల్లి ఇద్దరు పక్క పక్కనే కూర్చోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు సన్నాహక సమావేశానికి కాంగ్రెస్ అనుబంధ విభాగమైన ఎస్సీ సెల్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై అధ్యక్షుడు సాయిబాబా అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మక్తల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మక్తల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మక్తల్‌కు చెందిన కర్రెం తిమ్మప్ప(31) హమాలీ పని చేస్తున్నాడు. మంగళవారం నారాయణపేట క్రాసింగ్ వద్ద ఉన్న డబ్బాకు విద్యుత్ సరఫరా అయి అక్కడే ఉన్న అతనికి విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

బస్సు, ఆటో ఢీ : వ్యాపారి..


రాముడు (ఫైల్)

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ పట్టణానికి సొంత ఆటోలో కూరగాయల కోసం వెళ్తుండగా, హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడడంతో వ్యాపారి మృతి చెందిన ఘటన మంగళవారం కొత్తపేట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన వ్యాపారి గడ్డికోపుల రాముడు(43) కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం పెద్దకొత్తపల్లిలో వారాంతపు సంత ఉండడంతో తన సొంత ఆటోలో కొల్లాపూర్ వెళ్తున్నాడు. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కొత్తపేట సమీపంలో చెట్టు కొమ్మను తప్పించబోయి ఆటోను ఢీకొట్టడడంతో రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో ఇద్దరు అన్నలు వేర్వేరు ప్రమాదాల్లోనే చనిపోయారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొల్లాపూర్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

అచ్చంపేట రూరల్: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రంగాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన కృష్ణమాచారి(50) వడ్రంగి పనులు చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం రంగాపూర్‌లో ఓ ఇంటి వద్ద తలుపులు బిగించి తిరుగు ప్రయాణమయ్యాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మంగళవారం రంగాపూర్ శివారులో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూశారు. కృష్ణమాచారి మృతదేహం చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అతనికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని, అతని భార్య ప్రభావతి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యను ఇనుప సీకుతో కాల్చిన భర్త

మహమ్మదాబాద్: కుటుంబాన్ని పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించిన భార్యపై భర్త దాడి చేసి ఇనుప సీకుతో చేతులు కాల్చిన హృదయ విదారక ఘటన మంగళవారం గండీడ్ మండలం జక్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గండీడ్ మండలం జక్లపల్లి గ్రామానికి చెందిన కుర్వ మాధవులుకు నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీశైలమ్మతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని రోజులుగా మాధవులు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై శ్రీశైలమ్మ ఈనెల 18న భర్తను నిలదీసింది. 'కుటుంబాన్ని పట్టించుకోకుండా తాగి తిరిగితే ఎలా?' అని ప్రశ్నించింది. దీంతో కోపోద్రిక్తుడైన మాధవులు భార్యపై దాడి చేశాడు. అంతటితో ఆగక ఇనుప సీకు వేడి చేసి చేతులు కాల్చాడు. దీంతో బాధితురాలు మంగళవారం మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

తమ్ముడిపై కత్తితో అన్న దాడి

కోస్గి: అన్నదమ్ముల మధ్య ఉన్న భూ తగాదాల నేపథ్యంలో తమ్ముడిపై ఓ అన్న కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన కోస్గి మండలం పోలేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పోలేపల్లికి చెందిన గోపాల్, శశి ఇద్దరు అన్నదమ్ములు. వీరి మధ్య వ్యవసాయ పొలం విషయంలో కొంతకాలంగా తగాదాలు నడుస్తున్నాయి. ఈ నెల 2న తమ్ముడు శశి ఇంట్లో దొంగతనం జరిగింది. రూ.50 వేల నగదు, మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సోదరులపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటికే భూ తగాదాలు నడుస్తున్నాయి. మళ్లీ దొంగతనం కేసు పెట్టడంతో తమ్ముడిపై అన్న గోపాల్ కక్ష పెంచుకున్నాడు. మంగళవారం సాయంత్రం గోపాల్ కత్తితో తమ్ముడిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.




బాధ్యత మరచి.. బరువులు మోయించి


బాధ్యత మరచిన కొందరు ఉపాధ్యాయులు చదువుకోడానికి వచ్చిన పిల్లలకు పలుగు పార పట్టించి.. స్టేజీ నిర్మాణం అంటూ వారితో రాళ్లు, మట్టి మోయించారు. గండేడ్‌లో శిథిలావస్థకు చేరిన జెడ్పీహెచ్ఎస్ భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణం చేపట్టారు. అయితే కొత్త భవనం ముందు స్టేజీ నిర్మాణానికి కొందరు స్థానికులు ముందుకు వచ్చారు. దీంతో మంగళవారం ఓ మేస్త్రీని పిలిపించి.. అతనికి సహాయంగా పాఠశాల విద్యార్థులను పనిచేసేందుకు పురమాయించడంతో.. చదువుకోవడానికి వచ్చిన చిన్నారులు ఇలా కష్టపడుతూ కనిపించారు. - గండేడ్

దేవాలయాల్లో చోరీ

గద్వాల క్రైం: మండల పరిధిలోని పలు దేవాలయాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అనంతపురం గ్రామంలో శ్రీ మునిశంకర స్వామి, రామాలయం, తీగలపల్లి దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి కానుకల హుండీలను ఎత్తుకెళ్లారు. దగ్గర్లోని నిర్మానుష ప్రాంతంల్లో హుండీలను ధ్వంసం చేసి రూ.10 వేల నగదును తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పలు ఆధారాలను సేకరించారు. చోరీకి పాల్పడిన సమయంలో సీసీ కెమెరాల్లో నిందితుల కదలికలు పోలీసులు గుర్తించారు. వాటి ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆలయ పూజరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి

- జూరాలకు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆలమట్టికి 1.16లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్


కొత్త నీళ్లతో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

ధరూరు/ఆత్మకూరు/మదనాపురం/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు10వేల క్యూసెక్కులకు పెరిగిందని పేర్కొన్నారు. వరద లేకపోవడంతో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేసిన అధికారులు మంగళవారం రాత్రి 7 గంటలకు ఒక దిగువ కేంద్రంలో యూనిట్‌ను తిరిగి ప్రారంభించారు. దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో రెండు రోజులుగా 2.750 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి కోసం 8,061 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపులను కొనసాగించి 1500 క్యూసెక్కులను ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపుతున్నారు. అలాగే ఎడమ కాల్వ ద్వారా 640 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2 ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 1,300 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 11,568 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జూరాల పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.611 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

- ఎగువన కర్ణాటకలోని ఆలమట్టి ప్రాజెక్టు నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 74.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,16,263 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి 8,857 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 20.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 13,681 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి కేవలం 50క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు.
- శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రం 814.6 అడుగుల నీటిమట్టం, 37.0868 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ప్రాజెక్టులోకి 27,979 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

ఎన్‌టీఆర్ కాల్వకు నీటి విడుదల..

వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలశయంలో మంగళవారం సాయంత్రానికి పూర్తిస్థాయి నీటిమట్టం1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 850 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులను వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు


దేవరకద్రలో పెచ్చులూడుతున్న పాఠశాల గదిని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దేవరకద్ర: మండల కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. సాక్షిలో వచ్చిన ‘అటెన్షన్ ప్లీజ్’ కథనానికి స్పందించి తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు పాఠశాలను సందర్శించారు. పాఠశాల పైకప్పు పెచ్చులూడి దృశ్యాలను వారు ప్రత్యక్షంగా చూశారు. పాఠశాలలో కిటికీలు, భీమ్‌లు తుప్పుపట్టడం పరిశీలించారు.

విద్యార్థులకు వేరే గదులు కేటాయించాం..

గదులన్నీ శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ భవనంలో గదులను కేటాయించామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల పక్కన కొత్తగా నిర్మించిన స్టాఫ్ గదిలో కొందరు విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 'మన ఊరు మన బడి' పథకంలో పాఠశాలకు రూ.41 లక్షల నిధులు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్ పనులు చేయక పోవడం వల్ల సమస్య వచ్చిందన్నారు. ఈ విషయం ఏఈతో మాట్లాడి కాంట్రాక్టర్ పనులు చేయకుంటే రెండో స్థానంలో ఉన్న కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తామని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం


తనీషా

గండేడ్: సల్కర్‌పేట మినీ గిరిజన గురుకుల పాఠశాల నుంచి విద్యార్థిని అదృశ్యమై, మొయినాబాద్‌లో ప్రత్యక్షమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల, ఉపాధ్యాయుల కథనం ప్రకారం.. గండేడ్ మండల పరిధిలోని పంచాంగల్ తండాకు చెందిన రాజు, సునీతలకు ముగ్గురు సంతానం. చిన్న కుమార్తె తనీషాను ఈ ఏడాది జూలై 1న సల్కర్‌పేట మినీ గురుకులంలో ఐదో తరగతిలో చేర్పించారు. తనీషాకు ఆరోగ్యం బాగలేదని వారం రోజుల కిందట ఇంటికి వెళ్లింది. సోమవారం తల్లి సునీత, బాబాయ్ వెంకటేశ్‌లు బాలికను గురుకులంలో వదిలిపెట్టి వెళ్లారు. మంగళవారం ఉదయం నుంచి బాలిక అదృశ్యమైంది.

మొయినాబాద్‌లో ప్రత్యకం..

తనీషా ఉదయం 7.30 గంటల సమయంలో స్నేహితురాలితో నీవు స్నానం చేసిరా.. నేనే తర్వాత చేస్తానని చెప్పింది. తర్వాత కనిపించక పోవడంతో డ్యూటీ టీచర్ అమ్మాయిలేదని తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. వెంటనే వారు పలుచోట్ల వెతికారు. గండేడ్‌లోనే గంటసేపు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. తర్వాత కోస్గి, మహమ్మదాబాద్‌లో కుటుంబీకులు వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. రెండుగంటల సమయంలో అమ్మాయి మొయినాబాద్‌లో తన చిన్నమ్మ దగ్గరకి చేరినట్లు వెంకటేశ్ తెలిపారు. గురుకుల ఉపాధ్యాయుల గేట్ తాళం వేయకుండా నిర్లక్ష్యంగా ఉండడం వల్లే బాలిక అదృశ్యమైందని పలువురు ఆరోపిస్తున్నారు.

బలవంతంగా ఉంచి వెళ్లారు..

తనీషాను బలవంతంగా గురుకుల పాఠశాలలో వదిలివెళ్లారని గురుకుల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాపా వచ్చినప్పటి నుంచి గురుకులంలో ఉండనని ఏడుస్తోందని తల్లిదండ్రులకు చెప్పామన్నారు. అయినా తల్లి, బాబాయ్ బలవంతంగా తనీషాను వదిలి వెళ్లారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. గురుకుల ప్రహరీ దూకి తనీషా వెళ్లినట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు


ప్రమాదంలో బోల్తాపడిన ఆటో

మాగనూర్: మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం మాగనూరు మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మన్సన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దండు శ్రీనివాసులు కుటుంబం కర్ణాటకలోని కొర్తికొండలోని ఇంటి దేవుడికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా నల్లగట్టు మారెమవ్వ ఆలయం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఆటోకు కుక్క అడ్డుగా రావడంతో కుక్కను ఢీకొని ఆటో బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న లక్ష్మి, పద్మ, ఈశ్వరయ్య, శాంతమ్మ, పల్లవికి చిన్నపాటి గాయాలు కాగా, ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. శ్రీనివాసులుకు కాలువిరిగింది. మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీనివాసులును హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఏఎస్‌ఐ మన్సన్ తెలిపారు.

నిందితుడికి జైలు శిక్ష

కొత్తకోట రూరల్: దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష పడిన ఘటన ఆత్మకూర్ కోర్టులో మంగళవారం చోటుచేసుకుంది. మిరాసిపల్లికి చెందిన బోయ మన్యం 2014లో రెండు ఇళ్లలో నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీ చేయడంతో కేసులు నమోదయ్యాయి. ఆత్మకూర్ కోర్టు మంగళవారం అతనికి ఏడాది ఆరునెల లు జైలు శిక్ష,రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

బురదలో కూరుకుపోయిన బస్సు


మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో రోడ్డు పక్కన బురదలో కూరుకుపోయిన కర్ణాటక బస్సు

గట్టు : మూడు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి మిట్టదొడ్డి స్టేజీ వద్ద బస్సు బురదలో ఇరుక్కున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. రాయిచూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూల్‌కు ప్రయాణికులతో వస్తుండగా మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో మరో వాహనానికి సైడ్ ఇవ్వబోయి రోడ్డు పక్కకు దిగడంతో బురదలో ఇరుక్కుపోయింది. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి, జేసీబీ సహాయంతో బస్సును బురదలోంచి బయటకు తీశారు. అలంపూర్ చౌరస్తా నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 70 కిలోమిటర్లు ఉండగా, 59 కిలోమిటర్ల వరకు కొత్త రోడ్డు వేశారు. మిగిలిన 11 కిలోమిటర్ల రోడ్డును పూర్తి చేయకుండా అధికారులు వదిలేశారు. దీంతో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పొలం పనులకు వెళ్తూ.. మృత్యుఒడికి

- దుందుభి వాగు దాటుతున్న ఇద్దరు యువతుల మృతి
- అన్నదమ్ముల కుటుంబంలో విషాదం నింపిన సంఘటన


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జడ్చర్ల టౌన్: పొలం పనులకు వెళ్తుండగా దుందుభీ వాగు దాటే క్రమంలో బండపై ఉన్న పాకర కారణంగా కాళ్లు జారి ఇద్దరు యువతులు మృతిచెందారు. మంగళవారం ఉదయం జడ్చర్ల మండలంలోని కొండేడ్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటన అన్నదమ్ముల కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.వాగులో ఇద్దరు యువతులు గల్లంతైన విషయం తెలియగానే చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. యువతుల మృతదేహాలను పోలీసులు బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో గ్రామంలో అంత్యక్రియలు జరిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ఇదీ కుటుంబాల నేపథ్యం..

వాగులో మృతిచెందిన పడకంటి స్వాతి తల్లిదండ్రులు నాగమ్మ, కేశవులు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు రెండెకరాల భూమి ఉంది. రెండో కూతురు స్వాతి పదో తరగతితో చదువు మానేసి తల్లిదండ్రులతోపాటు గ్రామంలో కూలి పనులకు వెళ్తుంది. అలాగే అనూష తల్లిదండ్రులు యాదమ్మ, మల్లయ్య దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. మూడెకరాల భూమి ఉంది. రెండో కుమార్తె అనూష ఇంటర్‌తో చదువు మానేసి కూలీ పనులకు వెళ్తుంది.

సందర్శించిన ఎస్పీ, జెడ్పీ వైస్‌చైర్మన్లు..

వాగులో ఇద్దరు యువతులు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎస్పీ కె.నరసింహ, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య చెప్పారు.

కృష్ణాలో మొసలి సంచారం

కృష్ణా: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి మొసలి సంచరించడంతో కృష్ణా గ్రామ ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. కృష్ణా గ్రామంలోని ధర్మశాల ప్రాంతం నదితీరంలో ఉంటుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదిలో నీరు నిండుగా ప్రవహిస్తోంది. నదిలో ఉన్న విష పురుగులు, జంతువులు ఆ ప్రాంతంలో సంచరిస్తుంటాయి. జనాల్లోకి మొసలి రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. విష ప్రాణుల నుంచి తమను రక్షించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కృష్ణా బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్


కృష్ణా బ్రిడ్జిపై ఇరుక్కున లారీలు

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి మీద మంగళవారం రెండు భారీ వాహనాలు ఎదురెదురు రావడంతో ఇరుక్కుపోయాయి. దీంతో వాహనాలు అటు, ఇటు వెళ్లడానికి దారిలేక తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటువైపు, ఇటువైపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే శక్తినగర్ పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని గ్యాస్ కట్టర్‌తో ఇరుక్కున వాటిని తొలగించడంతో ట్రాఫిక్ క్లియరైంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతల వల్ల ప్రతిరోజూ భారీ వాహనాలు నిలిచిపోవడం, ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతూనే ఉన్నాయి. కొత్త వంతెన పూర్తి అయితే తప్ప ప్రయాణికుల ఇబ్బందులు తీరవని వాహనదారులు పేర్కొంటున్నారు.

అడవి బిడ్డలకు పునరావాస పథకం

- ప్రభుత్వ విప్ గువ్వల బాల్‌రాజ్

మన్ననూర్: అటవీ లోతట్టు ప్రాంతాల్లో, చెంచు పెంటల్లో జీవిస్తున్న ఆదివాసీలు గ్రామీణ ప్రాంతాల్లోకి తరలి వస్తే వారికి పునరావాస పథకం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. దశాబ్దాలుగా అడవుల్లో జీవిస్తున్నప్పటికీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆదివాసీ చెంచులు గ్రామాలు, పట్టణాలకు తరలొచ్చి సురక్షితమైన జీవనం సాగించాలన్నారు. అలాంటి వారికి అన్ని రకాల వసతులు ప్రభుత్వమే కల్పించేలా పథకం రూపొందించినట్లు ఆయన తెలిపారు. అటవీశాఖ తరుపున కూడా వారికి సహకారం అందించే దిశగా మంగళవారం హైదరాబాద్‌లో అటవీశాఖ పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్‌తో కూడా మాట్లాడినట్లు తెలిపారు. ప్యాకేజీ కల్పించడం ఒక అంశం కాగా, అడవుల్లోనే ఉండాలని సుముఖత వ్యక్తం చేస్తున్న వారికి ఎలాంటి ఆటంకాలు ఇబ్బందులు కలిగించకపోగా, వారి కోసం సదుపాయాలు, రక్షణ కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగించకుండా ఉండేందుకు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఆ బాధ్యత తనపై ఉందన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష, 19మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసులు ఇటీవల చేసిన డ్రంకెన్ డ్రైవ్‌లో నర్సింహులు, చెన్నకేశవులు అనే ఇద్దరు వాహనదారులు మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి డీ నిర్మల వాహనదారుడు నర్సింహులుకు ఒక రోజు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, చెన్నకేశవులుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసులు ఇద్దరిని జైలుకు తరలించారు.

మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు చేసిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేసిన తనిఖీల్లో మొత్తం 15మంది పట్టుబడ్డారు. వీరికి మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో న్యాయమూర్తి డి.నిర్మల రూ.41500 జరిమానా విధించారు.

అడ్డాకుల: ఎస్‌ఐ మాధవరెడ్డి వనపర్తి జిల్లా మదనాపురం మండలం దంతనూర్‌కి చెందిన సంద నాగరాజు ఈనెల 14న డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ తనిఖీల్లో తమకు పట్టుబడినట్లు వివరించారు. నిందితుడిని మంగళవారం మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ జూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నిర్మల ఎదుట హాజరుపరచగా రెండు రోజుల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో కుచ్చూర్‌కల్ గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలం మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్‌ఐ పురుషోత్తం మంగళవారం తెలిపారు. కోర్టులో హాజరుపరచగా రూ.2వేల జరిమానా, ఒకరోజు జైలుశిక్ష విధించారని వివరించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా...



రాష్ట్రపతితో జయధీర్ తిరుమలరావు

రాష్ట్రపతి భవన్‌లో ఆదివాసీ కళా ప్రదర్శన

ద్రౌపదీముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం పాత తివాచీల మ్యూజియంలో సూత్ర కళాదర్పణ్, జనజాతి దర్పణ్ పేర్లతో ఆదివాసీ కళాప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో ఆదివాసీ స్వాతంత్ర్య ఉద్యమ వీరుల చిత్రపటాలు, వ్యవసాయ పరికరాలు, లోహ కళాఖండాలను, ఆదివాసీ జీవిత ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఇందిరాగాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం మెంబర్ కార్యదర్శి సచ్చిదానం జోషి, హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమలరావు, జానపద సంపద విభాగం అధిపతి కె.అనిల్‌కుమార్, అరుణ్ కుమార్‌రెడ్డి, సతీశ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలోని కళాఖండాలను తిలకించి ఇలాంటి అతిపెద్ద మ్యూజియం ఏర్పాటుకు ఇది తొలి అడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇందులో సగానికి పైగా కళా ఖండాలను ప్రదర్శించిన హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం వారిని రాష్ట్రపతి అభినందించారు.

మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మైహోం సిమెంట్ పరిశ్రమలో 4వ ప్లాంట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో నాల్గవ అంతస్తు స్లాబ్ పనులు చేస్తుండగా దాని కింద నుంచి రెడిమిక్స్‌ను బ్లోయర్ ద్వారా పై అంతస్తులకు చేరవేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో రెడిమిక్స్ పైకి పంపిస్తుండగా జామ్ కావడంతో ఆ నలుగురు కార్మికులు పైపులను సరిచేస్తుండగా ఒక్కసారిగా 40 మీటర్ల ఎత్తులో పైపులు విరిగి పోవడంతో వారు కింద పడిపోయారు. వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్ సింగ్ (32) మృతిచెందగా.. రాజాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

దారుణంగా దర్యాప్తు

వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల

సాక్షి, అమరావతి: సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ కూడా చెత్తగా దర్యాప్తు చేస్తుందనేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేని గుంట నక్కలకు సీబీఐ వేదికగా మారిందని మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పిత కథేనని కొట్టిపారేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బాకాలు ఊదే ఎల్లో మీడియాకు నాలుగు రోజులు మసాలా కథనాలు వండివార్చడానికి మాత్రమే సీబీఐ ఛార్జ్‌షీట్ ఉపయోగపడుతుంది కానీ ఈ డైలీ సీరియల్ న్యాయస్థానాల్లో నిలబడదని తేల్చి చెప్పారు. వైఎస్ భారతమ్మ, తాను కలిసి సునీతమ్మ ఇంటికే వెళ్లలేదని సజ్జల స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకురావాలని సునీతమ్మను తాను ఎలా కోరుతానని ప్రశ్నించారు. సునీతమ్మ పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేదా?

ఎలాంటి ఆధారాలు లేకున్నా కేవలం వ్యక్తుల వాంగ్మూలాలను కల్పిత కథకు అనుకూలంగా మారుస్తూ సీబీఐ ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తోంది. వైఎస్ వివేకా హత్య వల్ల నష్టం ఎవరికి? అని ప్రశ్నిస్తే.. వైఎస్సార్ సీపీకి, జగన్‌కే అని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇంకా చెప్పాలంటే నాడు కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్‌రెడ్డికి నష్టం. రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవాలని ఆయన ఎందుకు అనుకుంటారు? ఏ చిన్న దర్యాప్తు సంస్థ అయినా, ప్రైవేట్ డిటెక్టివ్ సంస్థకైనా ఈమాత్రం ఇంగితం ఉంటుంది. వివేకా హత్య కేసును రెండు సిట్‌లు దర్యాప్తు చేశాయి. అవి సేకరించిన కాల్ రికార్డ్స్, డేటాను సీబీఐ ఏం చేసిందో తెలియదు.

వ్యవస్థల్లోకి వైరస్‌లా చంద్రబాబు..

అన్ని వ్యవస్థల్లో వైరస్‌లా పాకిన చంద్రబాబు తన అనుచరులతో జాతీయ స్థాయిలో మేనేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నారు. వివేకా హత్య వల్ల నాడు అధికారంలో ఉన్న చంద్రబాబుకు రెండు లాభాలు. ఒకటి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం.. రెండోది.. పాదయాత్ర పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌ను తేరుకోనివ్వకుండా చేయడం.

ప్రత్యర్థుల క్యాంపులో సునీతమ్మ..:

కారణాలు ఏమిటో తెలియదుగానీ వివేకా కుమార్తె సునీతమ్మ ఆ తర్వాత వ్యవహరిస్తున్న తీరు



చూస్తుంటే ఆమె పూర్తిగా ప్రత్యర్థుల క్యాంపులోకి వెళ్లినట్లు అనిపించింది. కథ మలుపు తిరగాలన్నప్పుడల్లా వారికి అనుగుణంగా ఆరేడు సార్లు సునీతమ్మ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వారికి కావాల్సిన స్టేట్‌మెంట్లు తీసుకుంటూ ఇన్వెస్టిగేషన్ రివీల్డ్ అంటున్నారు. సునీల్ యాదవ్ అనే నిందితుడు బెయిల్‌కి దరఖాస్తు చేసినప్పుడు గూగుల్ టేకవుట్‌ను తెరపైకి తెచ్చి అవినాశ్‌రెడ్డి తండ్రిని లోపల పెట్టేశారు. గూగుల్ టేకవుట్ ఈ కేసులో నిలబడదని తెలియగానే యూనివర్సల్ టైమ్ కో-ఆర్డినేటర్ ప్రకారం మన సమయానికి 5.30 గంటలు కలపాలన్నారు. ఆ లెక్కన వారు చెప్పిన టైం మరుసటి రోజు 8 గంటలు కావడంతో దాన్ని పక్కన పెట్టేశారు. అది నిలబడదని వారికీ అర్థమైంది.

తెలంగాణ హైకోర్టు ప్రశ్నించడంతో..

తెలంగాణ హైకోర్టు గత మే 31న మొదటిసారిగా కేసును క్షుణ్ణంగా పరిశీలించి సీబీఐని పలు ప్రశ్నలు అడిగింది. మేం ముందు నుంచీ వ్యక్తం చేస్తున్న సందేహాలే అవి. అవినాశ్‌రెడ్డి జూన్ 19న సీబీఐ డైరెక్టర్‌కి లేఖ రాయడంతో సునీతమ్మ స్టేట్‌మెంట్ మరొకటి రికార్డు చేశారు. హింసాత్మక సంఘటనలు జరుగుతాయనే లేఖను బయట పెట్టలేదని సునీతమ్మ చెబుతున్నారు. అది అసహజం. సొంత తండ్రి చనిపోయినా లేఖ విషయాన్ని పట్టించుకోలేదంటే ఎలా నమ్మడం?

పది రోజుల తర్వాత పరామర్శకు వెళ్లా..

2019 మార్చి 23వ తేదీన భారతమ్మ వచ్చి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్లు చేయమన్నారని సునీతమ్మ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అవినాశ్‌ను సమర్థించాలని నేను కోరినట్లు కథ అల్లారు. ఆ రోజు భారతమ్మ, నేను కలిసి ఆమె ఇంటికి వెళ్లలేదు. వివేకా హత్య జరిగిన తర్వాత పది రోజులకు నా భార్యతో కలసి పరామర్శించడానికి వెళ్లా. బాగా షాక్‌తో ఉంటారనుకున్నాగానీ అంత ఇదిగా అయితే కనిపించలేదు. షాకింగ్ సంఘటన జరిగినప్పుడు మొదట ఇంటికి పెద్దలా ఉన్న వైఎస్ జగన్‌కు ఫోన్ రావాలి. కానీ సునీతమ్మ వైపు నుంచి ఫోన్ రాలేదు. వివేకా వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు ఈరోజు ఆమెకు మిత్రులు, సలహాదారులు, సన్నిహితులు. వివేకాకు మచ్చ రాకూడదని అవినాశ్‌రెడ్డి కుటుంబం మూడేళ్లు మౌనంగా అన్నీ భరించింది. చనిపోయిన వ్యక్తి గౌరవాన్ని కాపాడాలని మేం తపన పడుతుంటే బతికున్నవారినే సునీతమ్మ బజారుకీడుస్తున్నారు. బతుకులను నాశనం చేసే పరిస్థితికి వచ్చాక మౌనం వీడి నోరు తెరవాల్సి వస్తోంది.

వివేకా కోసం అవినాష్ ధర్నా

నిజానికి నాడు వివేకాకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని జగన్‌కు ప్రతిపాదన చేసింది అవినాశే. ఒక ఎంపీటీసీని టీడీపీ నేతలు ఎత్తుకెళితే వివేకా కోసం అవినాశ్‌రెడ్డి స్వయంగా ధర్నాకు కూర్చున్నాడు. 2011లో పార్టీ పెట్టినప్పటి నుంచీ పులివెందుల విషయంలో తన ప్రతినిధిగా అవినాశ్‌ను జగన్ ఎంపిక చేసుకున్నారు. వైఎస్సార్‌కు వివేకా ఎలాగో ఇప్పుడు జగన్‌కు కూడా అవినాష్ అలానే.

గుంట నక్కలకు వేదిక..

వివేకాను వారే హత్య చేశారనేందుకు పది పన్నెండు కారణాలున్నాయి. ఆస్తి, కుటుంబ పరువు విషయాలే ప్రధానంగా హత్యలకు దారి తీస్తాయి. వివేకా చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ స్టేట్‌మెంట్లో అన్నీ ఉన్నాయి. వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి బెదిరించాడని, మనుషులను పంపించాడని ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీనిపై సీబీఐ ఎందుకు విచారించదు? అన్ని శక్తులు ఉడిగిపోయిన గుంటనక్కలన్నీ ఒకచోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు సీబీఐని వేదికగా చేసుకుంటున్నాయి. పది బండలు వేస్తే ఒకటన్నా నమ్మకపోతారా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కోర్టు ఒకసారి మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తి అమ్ముడుపోయాడంటూ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో నేరుగా బురద చల్లే దుస్సాహసానికి ఒడిగట్టింది. జర్నలిజం పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కరివేపాకులా సునీతమ్మను వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగియగానే ఆమెను అనాథలా పక్కన పెట్టడం ఖాయం.

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్

ఆధారాలు, పరిసరాలు, హత్యలో పాల్గొన్న వ్యక్తులు ఇలా అన్నీ ఒక వైపు చూపిస్తుంటే.. దర్యాప్తు మరోవైపు సాగుతోంది. ఎప్పుడైతే సునీతమ్మ ఆలోచన విధానం మారిందో అప్పుడే కేసును బలవంతంగా తిప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబుకు లాభం చేకూరేలా మార్చారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తులు కాబట్టి సీబీఐ చేతికి వచ్చాక వారికి తగ్గట్టుగానే అన్నీ జరుగుతూ వచ్చాయి. అవినాశ్‌రెడ్డి వైపు వేలు చూపించేందుకు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రెండు మూడు నెలలు ట్రైనింగ్ కూడా ఇచ్చారు.

జస్టిస్ సామ్ కోషి బాధ్యతల స్వీకరణ రేపు

ప్రమాణం చేయించనున్న హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ సామ్ కోషి ఈ నెల 27న బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీం కోర్టు కొలీజియం తొలుత మధ్యప్రదేశ్‌కు సిఫార్సు చేయగా, వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సుప్రీంకోర్టు కొలీజియం ఆయనను తెలంగాణ హైకోర్టుకు సిఫార్సు చేయగా, రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

1991లో న్యాయవాదిగా ఎన్‌రోల్

జస్టిస్ సామ్ కోషి మధ్యప్రదేశ్‌లో 1967, ఏప్రిల్ 30న జన్మించారు. జబల్‌పూర్‌లోని జీఎస్ కళాశాల నుంచి కామర్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్య పూర్తిచేసి 1991, మార్చి 9న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగం, సివిల్, సర్వీస్, లేబర్ అంశాల్లో ఎక్కువగా కేసులు వాదించారు. 2000 నుంచి 2013 వరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు, సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ బోర్డులకు కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. 2005 నుంచి 2006 వరకు డిప్యూటీ అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు. 2013, సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియామితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు.

9 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
బి.గోపి	సీసీఎల్ఏ సెక్రెటరీ	కలెక్టర్, కరీంనగర్
ఆర్‌వీ కర్ణన్	===	కలెక్టర్, నల్లగొండ
టి.వినయ్‌కృష్ణారెడ్డి	కలెక్టర్, నల్లగొండ	రిపోర్ట్ టు జీఏడీ
వెంకటేశ్ దోత్రే	అడిషనల్ కలెక్టర్, మహబూబ్‌నగర్	అడిషనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
చెక్క ప్రియాంక	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) సూర్యాపేట
హేమంత కేశవ్ పాటిల్	====	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) ఆసిఫాబాద్
జల్ద అరుణశ్రీ	అడిషనల్ కలెక్టర్, కరీంనగర్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) పెద్దపల్లి
ప్రఫుల్ దేశాయి	అడిషనల్ కలెక్టర్, జనగాం	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) కరీంనగర్
జి.రమేశ్	స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, యూఎల్‌సీ,హైదరాబాద్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) మెదక్

సెల్‌ఫోన్ వాడుతోందని తలపై మోదాడు

అన్న చేతిలో చెల్లెలి మృతి


ఇల్లెందురూరల్: సెల్‌ఫోన్ విషయంలో అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఘర్షణ చివరికి చెల్లెలి ప్రాణాలు తీసింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఎస్సీ బస్తీ గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్‌ఎంగా శిక్షణ పొందిన అజ్మీరా సింధు (23)ను సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని ఆమె సోదరుడు హరిలాల్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హరిలాల్ రోకలిబండతో సింధు తలపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన సింధును కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తలపై బలమైన గాయం ఉండటం, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టగా సోదరుడు కొట్టడమే కారణమని వెల్లడైంది. కాగా, నిందితుడు హరిలాల్ పరారీలో ఉన్నట్లు ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపారు.

వట్టెం నవోదయలో క్రీడాపోటీలు

బిజినేపల్లి: వట్టెం జవహార్ నవోదయ విద్యాలయంలో తెలంగాణ క్లస్టర్ స్థాయి క్రీడలు జూలై 27, 28వ తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పీ భాస్కర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి నిర్వహించబోయే ఈ పోటీల్లో ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, కబడ్డీ, టెబుల్ టెన్నిస్, ఇతరాత్ర కేటగిరిల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రీజినల్ స్థాయికి ఎంపిక చేసి పంపుతామన్నారు. ఈ క్రీడల్లో దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

పునరుద్ధరణ పనులు షురూ

అయిజ: పట్టణంలోని పెద్ద వాగులో ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులైన్ పునరుద్ధరణ పనులను మంగళవారం ప్రారంభించారు. పెద్దవాగులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులతో పైపులైన్ ధ్వంసమైందని, పైపులైన్ నిర్మాణానికి ఫిల్లర్లను నిర్మించాలని కాంట్రాక్టర్లను మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ అధికారులు కోరారు. మొదట్లో కాంట్రాక్టర్లు ససేమిరా అన్నప్పటికీ.. అధికారుల ఒత్తిడితో సొంత ఖర్చులతో ఫిల్లర్ల నిర్మాణ పనులను చేపట్టారు. పనులను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నర్సింగం, ఈఈ ప్రగతి, డీఈ కిరణ్ కుమార్, జేఈ మహేష్‌తోపాటు మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, ఈఈ భీమేశ్వర్‌రావు, డీఈ నాగరాజు, ఏఈ రమేష్ పరిశీలించారు.



జనరల్ ఆస్పత్రిలో గుండె వైద్యసేవలు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో గుండె పరీక్షిస్తున్న వైద్యుడు

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: అన్ని రకాల జబ్బులకు మహబూబ్‌నగర్‌లోనే వైద్యం అందిస్తామని, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇకపై ప్రతి మంగళవారం గుండె వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారంఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ వైద్యరంగంలో ఎంతో మార్పులు వచ్చాయన్నారు. ప్రత్యేకించి దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని వైద్య కళాశాలలు తెలంగాణలో ఉన్నాయని, జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉన్న చరిత్ర తెలంగాణకే ఉందని తెలిపారు. 70 ఏళ్ల ఉమ్మడి రాష్ట్రాన్ని పరిపాలించిన గత ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండేవని, అలాంటిది బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని, దీని వల్ల జిల్లాలలో ఆస్పత్రులు అభివృద్ధి చెంది పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ ద్వారా 134 రకాల పరీక్షలను కార్పొరేట్ తరహాలో ఉచితంగా చేయడమే కాకుండా, అదే రోజు సాయంత్రమే సెల్‌ఫోన్‌కు టెస్టుల ఫలితాలను పంపిస్తారని పేర్కొన్నారు. గతంలో జనరల్ ఆస్పత్రిలో కేవలం 15 మంది డాక్టర్లు మాత్రమే ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 130-140కి పెరిగిందని, ఒక ల్యాబ్ టెక్నీషియన్ నుంచి 43 మందికి, ఒక ఫార్మసిస్టు నుంచి 40 మందికి, 30 మంది నర్సుల నుంచి 350 మంది వరకు సిబ్బంది పెరగడంతో పాటు అన్ని రకాల వైద్యసదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ పోస్టు మంజూరైనందున శాశ్వత డాక్టర్ నియామకానికి కృషి చేస్తున్నామని, అయితే పాత కలెక్టర్ స్థానంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల త్వరలోనే పూర్తికానున్నందున క్యాథ్ ల్యాబ్‌తో పాటు, నూతన ఎంఆర్ఐ యంత్రాలను అక్కడ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. అప్పటివరకు పూర్వపు నిమ్స్ డైరెక్టర్ డి ప్రసాద్ రావు సహకారంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతి మంగళవారం ఒక గుండె వైద్య నిపుణులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైతే వారంలో మరో 2 రోజులపాటు వీరిని ఇక్కడే పొడిగించే విధంగా ఏర్పాటు చేయా లని ఆయన కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.రవినాయక్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, నిమ్స్ మాజీ డైరెక్టర్ డి.ప్రసాద్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్, డాక్టర్ జీవన్, మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డాక్టర్ భాస్కర్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

84 మందికి పరీక్షలు

ఉచిత గుండె వైద్య శిబిరంలో మొత్తం 84 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఇందులో 2డీ ఎకో, ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. గుండె పరీక్షలు చేసిన వారిలో 8 మందికి యాంజియోగ్రామ్, ఇద్దరికి బైపాస్ సర్జరీ అవసరం అవుతుందని వైద్యులు గుర్తించారు. అంతకుముందు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో మొక్కలు పెంపకంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆస్పత్రి ఆవరణలో నర్సింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

టీ-హబ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పాలమూరు: ప్రతిరోజు టీ-హబ్‌కు వచ్చే నమూనాల వివరాలు, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు వచ్చే అవుట్ పేషంట్స్ వివరాలను సమర్పించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్ సదరు టీ-హబ్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఆవరణలో ఉన్న టీ-హబ్ సెంటర్‌ను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి నిత్యం ఎన్ని శాంపిల్స్ వస్తున్నాయని, ఫలితాలు ఎప్పుడు ఇస్తున్నారని తెలుసుకున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల ద్వారా శాంపిల్స్ వస్తున్నాయా లేదని కలెక్టర్ స్వయంగా రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీల నుంచి, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్స్ నుంచి వచ్చే అవుట్ పేషంట్స్ వివరాలతో పాటు జ్వరాల కేసులు తనకు ప్రతిరోజు ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత కలెక్టర్ పట్టణంలో ఉన్న రామయ్యబౌళి అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రతిరోజు ఓపీ ఎంతమంది వస్తున్నారు, ఎలాంటి వైద్య చికిత్సలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అక్కడికి చికిత్స కోసం వచ్చిన బాలేశ్వరి అనే మహిళతో కలెక్టర్ మాట్లాడి ప్రతిరోజు చూసే ఓపీకి, మంగళవారం చూసే ఓపీకి ఏదైనా తేడా ఉందని తెలుసుకున్నారు. మంగళవారం పీహెచ్‌సీలలో మహిళలకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీనిపై విస్తృతంగా తెలియజెప్పాలన్నారు. ఇకపై ప్రతిరోజు మెడికల్ ఆఫీసర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేసే విధంగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్, డాక్టర్ జీవన్, టీ-హబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రగతి, ప్రోగ్రామ్ అధికారులు ప్రగతి, శ్వేత పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం




కుచ్చూర్‌కల్‌లో అనిరుధ్‌రెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- టీపీసీసీ కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, ఏ గ్రామంలో చూసినా ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోండ్లపల్లి నుంచి ప్రజాహిత పాదయాత్ర ప్రారంభించారు. తిర్మలాపూర్, చెన్నవెల్లి, కుచ్చూర్‌కల్ గ్రామాల మీదుగా పాదయాత్ర రాజాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో చూసినా ప్రజలకు రేషన్‌కార్డులు, ఉండడానికి ఇళ్లు లేవని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ పాలన వస్తేనే తమ బతుకులు బాగుపడతాయని అన్నారు. నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తుంటే బీటీరోడ్లకు నిధులు మంజూరైనట్లు బీఆర్ఎస్ నాయకులు జీఓ కాపీలను సోషల్ మీడియాలో పెడుతున్నారన్నారు. ఇన్నిరోజులు ఎందుకు జీఓ కాపీలను బయట పెట్టలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కృష్ణయ్యగౌడ్, రమేష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌నాయక్, రవికుమార్‌గుప్తా, చంద్రకాంత్‌గౌడ్, కృష్ణయ్య, నసీర్‌బేగ్, గౌస్, తఖీబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఇవ్వకపోతే యుద్ధమే



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

అలంపూర్: రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల్లో మాలలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే పార్టీలపై యుద్ధం చేస్తామని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ హెచ్చరించారు. అలంపూర్ మున్సిపాలిటీలో తెలంగాణ మాలమహానాడు జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతలను మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ దివంగత చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక చైతన్య యువజన సంఘం నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులను సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ... జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గంలో మాలలు తీవ్ర అన్యాయానికి గురువుతున్నారన్నారు. తండ్రి పాత్రలో ఉండాల్సిన స్థానిక ఎమ్మెల్యే అబ్రహం మాలలను అణిచివేస్తున్నారని ఆరోపించారు. దళితబంధు పథకం, సంక్షేమ పథకాల్లో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని మాలలకు ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలన్నారు. మాలలను ఎదగనివ్వకుండా కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కళాకారుడు సాయిచంద్‌పై దాడులు చేశారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు మాలలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు మాలలకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే జోగుళాంబ అమ్మవారి దీవెనలతో యుద్ధభేరి మోగిస్తామన్నారు. మాలలు సంఘటితమై హక్కుల కోసం పోరాటం చేసి సాధించుకుందామన్నారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, జైభీమ్ సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి తుమ్మల రవికుమార్, బంగిలక్ష్మణ్, రాజగోపాల్, ఠాగూర్ తిమ్మప్ప, నాయకులు రజినిబాబు, పరశురాం, నడిపిబాబు, రాజు, శరత్‌బాబు, నగేష్, వెంకటి, నాగన్న, నగేష్, దశరథం, గోవిందు, రామాంజనేయులు, అనిల్‌కుమార్, పరుశ, నాగేష్, సాయి, నాగేంద్ర, నరసింహ తదితరులు ఉన్నారు.

జోరుగా.. తొలకరి శికారి

కృష్ణానదికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో ఒడ్డున ఉన్న మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల మత్స్యకారులు తొలకరి శికారి జోరుగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కొద్ది మొత్తంలో నీళ్లు రావడంతో మంగళవారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. ఒక్కొక్కరికి 50- 100 కిలోల చొప్పున పెద్ద బొచ్చ చేపలు పడ్డాయి. తొలకరి శికారి ప్రతి సంవత్సరం బాగా నడుస్తుందని, ఈసారి కూడా అలాగే ఉండాలని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

– పెంట్లవెల్లి

